నేటి దినపత్రిక
17 వ
సూర్య
www.suryaa.com
ఏలూరు జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లా
బుధవారం,17 జూలై 2024

చిన్నారులతో సరదాగా కాసేపు

– బుజ్జాయిలతో మమేకమైన
జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ఏలూరు,మేజర్ న్యూస్: దేశంలో కరోనా ఎంతటి భీభత్సం సృష్టించిందో అంత సులువుగా మర్చిపోలేం. ఎంతో మందిని పొట్టన పెట్టుకోవడంతో చాలామంది చిన్నారులను అనాధలను చేసింది. అలాంటి పిల్లలు సమాజంలో ఇబ్బందులకు గురికాకూడదనే ఉద్దేశ్యంతో ప్రవేశపెట్టిన పియంకేర్ చిన్నపిల్లల పధకం వారి జీవితాలకు కొంత భరోసా కల్పించింది. అలాంటి పిల్లల్లో అనాధలమనే ఆలోచన రాకుండ ఉండేందుకు చిన్నారులతో కాసేపు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి సరదగా గడిపి వారిలో ఉత్సాహం నింపారు. విధినిర్వహణలో ఎంతో బిజీగా ఉన్నప్పటికీ కొంత తీరిక చేసుకొని చిన్నా రులతో సరదాగా గడిపారు. చిన్నారులను ఆప్యాయంగా దగ్గరకు తీసుకొని వారితో మమేకమై మాట మంతి కలిపారు.దాంతో చిన్నారులు ఎటువంటి సంకోచం లేకుండా కేరింతలు కొట్టారు. పియంకేర్ బాలల పధకంలో మైనారిటీ తీరిన లబ్దిదారి అయిన ఒక యువతి వివాహం చేసుకొని చిన్నారికి జన్మనిచ్చింది. ఆ బుజ్జాయిని తనఒడిలోకి చేర్చుకొని కలెక్టర్ కొంతసేపు సరదాగా గడిపారు.

జిల్లా కలెక్టర్‌తో బదిలీపై వెళుతున్న ఎస్‌పి అజిత భేటీ

భీమవరం,మేజర్స్యూస్: ఇటీవల జరిగిన బదిలీల్లో విశాఖపట్నం బదిలీపై వెళ్లనున్న జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల మంగళవారం జిల్లా కలెక్టర్ సి.నాగరాణిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంలో ఎస్పీ అజిత వేజెండ్లకుజ్ఞాపికనుజిల్లాకలెక్టర్ అందజేశారు.

ఎస్సీ,ఎస్టీ చట్టాల అమల్లో రెవిన్యూ,పోలీసుల ప్రత్యేక కృషి

– కలెక్టర్ నాగరాణి,ఎమ్మెల్యేలు పులపర్తి, రఘురామ,ఎమ్మెల్సి 'వంక' సమీక్ష

భీమవరం,మేజర్ స్యూస్: స్థానిక కలెక్టరేట్ గ్రీవెన్స్ సమావేశ మందిరం నందు మంగళవారం జిల్లా కలెక్టర్ సి.నాగరాణి అధ్యక్షతన జిల్లా విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది.జిల్లాకలెక్టర్ చదలవాడనాగరాణిమాట్లాడుతూ జిల్లాలోని ఏ ప్రాంతంలోనైనా యానాదులు,ఎరుకలు ఉంటే వారి జీవనశైలి మెరుగుదలకు కృషి చేస్తామన్నారు. వీరవాసరం ఎస్సీ కాలనీలో కల్పించాల్సిన మౌలిక వసతులపై ఇప్పటికే చర్యలు తీసుకున్నామని స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీ అఘాయిత్యాలకు సంబంధించిన కేసులకు వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు తో పాటు త్వరితగతిన పరిష్కరించేందుకు ఆదేశించినట్లు తెలిపారు. ఎవరైనా ఉద్దేశపూర్వకంగా తప్పుడు కేసులు పెడితే విచారణ చేసి అట్టి వారిపై చర్యలకు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. భీమవరం శాసనస సభ్యులు పులవర్తి ఆంజనేయులు మాట్లాడుతూ ఎస్సీ,ఎస్టీ కేసులు ఎలా నమోదు చేయాలి,వారు ఎస్సీ,ఎస్టీ అవునా కాదా నిర్ధారణ చేసుకుని న్యాయం చేయాలని అన్నారు. యానాదులు ఎరుకలకు గృహాలను కేటాయించిన వాటిలో ఉండకుండా వాటికి దగ్గరలో గుడిసె వేసుకొని నివసిస్తున్నారని, వాళ్ల పిల్లలకు సరిగ్గా బట్టలు కూడా వేరని,అలాగే స్కూలు కూడాపంపించారనితెలిపారు.ఉండి శాసన సభ్యులు కనుమూరి రఘురామకృష్ణంరాజు మాట్లాడుతూ ఊహాజనిత కేసులలోఎఫ్ఐఆర్ నమోదుకు ముందు క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. శాసన మండలి సభ్యులు వంక రవీంద్రనాథ్ మాట్లాడుతూ కమిటీ సభ్యులు ఎస్సీ,ఎస్టీ కేసులనమోదులో బాధితులకు సహాయ సహకారాలు అందించాలన్నారు. కమిటీ సభ్యులు జె.సత్య సుధామ,పొన్నమండ బాలకృష్ణ,తెన్నేటి జగజ్జీవన్ రావు,ఎస్. త్రిమూర్తులు,సి. హెచ్ మంగరాజు మాట్లడారు.ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ సి.వి.ప్రవీణ్ ఆదిత్య, జిల్లా రెవిన్యూ అధికారి జె.ఉదయ భాస్కర రావు, జిల్లా అడిషనల్ ఎస్పీ వి.భీమారావు,ఆర్డీవో కె.శ్రీనివాసులు రాజు,డియస్పిలు జి.శ్రీనివాస రావు,డి.యస్.ఆర్. యస్.యన్.మూర్తి, వి.నారాయణ స్వామిరెడ్డి,జిల్లాసాంఘికసంక్షేమశాఖ అధికారికె.శోభా రాణి,జిల్లావివిధశాఖలు అధికారులు పాల్గొన్నారు.

కోవిడ్ బాధిత బాల బాలికల యోగ క్షేమాలపై ఆరా

– జీవితంలో ఉన్నతంగా స్థిరపడాలని ఆకాంక్షించిన కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ఏలూరు,మేజర్స్యూస్: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు సంబంధించి కోవిడ్ సమయంలో తల్లిదండ్రులను ఇద్దరినీ కోల్పోయినటువంటి అనాధ బాలబాలికలతో వారి యోగక్షేమాలను,భవిష్యత్తు లక్ష్యాలను తెలుసుకోవటానికి యాన్యువల్ ఇంట్రాక్షన్ మీటింగ్ విత్ పిఎంకేర్ బెనిఫిషరీస్‌లకు మంగళవారం స్థానిక కలెక్టరేట్ గౌతమి హాల్ నందు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధి,బాలలకు గార్డియన్‌గా ఉన్న కలెక్టర్,జిల్లా మెజిస్ట్రేట్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ బాలల(పిఎంకె బెనిఫిషరీస్) వ్యక్తిగత యోగక్షేమాలను ,ఆరోగ్య విషయాలను, చదువు పరిస్థితి, తెలుసుకొని బాలబాలికలు చదువు పట్ల ఏ విధంగా ప్రతి విషయంలోనూ ముందుకు వెళ్లి ఉన్నత లక్ష్యాలను నిర్ణయించుకొని తమకంటూ సమాజంలో గౌరవప్రదమైన స్థితిలో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 18 సంవత్సరాలు వయసు నిండిన బాల బాలికలకు 10 లక్షలు డిపాజిట్ అయిన పోస్టల్ ఎకౌంట్స్ సంబంధించినటువంటి పాస్ బుక్స్ 19మందికి అందించారు. అదేవిధంగా వారికి ఏమి అవసరం అయినా డైరెక్ట్ గా కలెక్టరుకి కాల్ చేయవచ్చని వారి ఫోన్ నంబర్ ఇవ్వటం జరిగింది. ఈ కార్యక్రమం నందు పోస్టల్ డిపార్ట్మెంట్ అసిస్టెంట్ సూపర్డెంట్ అయినటువంటి డి.శ్రీనివాస్, జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ, సాధికారత అధికారి కే.ఏ.వి.ఎల్.పద్మావతి,జిల్లాబాలల సంరక్షణఅధికారిడాక్టర్ సిహెచ్. సూర్య చక్రవేణి,ఆరోగ్యశ్రీ జిల్లా కో–ఆర్డినేటర్‌డా.రాజీవ్, జిల్లా ఎడ్యుకేషనల్ అధికారి ఎస్.అబ్రహం జిల్లా లీడ్‌బ్యాంక్ మేనేజర్ డి.నీలాద్రి , ఏఎల్ఎస్ఓ కోఆర్డినేటర్ సమగ్ర శిక్ష జి.రాధాకృష్ణ , బాలల సంక్షేమ సమితి సభ్యులు పి.వెంకటేశ్వరరావు, కే .హైమావతి , సిహెచ్ .రాజేశ్వర రావు,డిసిపియు సిబ్బందిఇన్స్టిట్యూషనల్‌కేర్ సిహెచ్.శ్రీకాంత్, జాహ్నవి ,బాలస్వామి,రాజేష్,రాజ్కుమార్, సునీత, మాధవి,శంకర్, రాజుధనలక్ష్మి,39మందిబాలలు,సంరక్షకులు పాల్గొన్నారు.

ఆకలితో అలమటిస్తున్న ఉపాధి కూలీలు

– కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు అందుగుల ఫ్రాన్సిస్

బుట్టాయిగూడెం,మేజర్ న్యూస్ : ఉపాధి కూలీలకు బకాయిలో చెల్లించకపోవడంతో ఆకలితో అలమటిస్తున్నారని కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు అందుగుల ఫ్రాన్సిస్ ఆవేదన వ్యక్తం చేశారు. బుట్టాయిగూడెం కెవిపిఎస్ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు.ఈ కార్యక్రమం ఉద్దేశించి ఏ ఫ్రాన్సిస్ మాట్లాడుతూ పేదలు కష్టపడి పనిచేసిన పనులకు చెల్లించవలసిన బకాయిలు చెల్లించకపోవడం బాధాకరమైన విషయం అన్నారు. గత నాలుగు నెలలుగా ఉపాధి కూలీలకు చెల్లించాల్సిన చెల్లించాలన బకాయిలు చెల్లించకపోవడంతో కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి కూలీలను ప్రభుత్వం ఆదుకోవాలని ఉపాధి కూలీలు పని ప్రదేశాల్లో సౌకర్యాలు కల్పించాలని ఉపాధి కూలీలకు పనిముట్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో బిడేవిడ్ రాజ్, వరకరాజు ఎం.వెంకటేశ్వరావు టి.సామ్యూల్ బి.విజయరాజు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటు వచ్చిన వ్యక్తిని కాపాడిన ప్రభుత్వ వైద్యులు

నర్సాపురం,మేజర్ న్యూస్ : అకస్మాత్తుగా గుండెపోటు వచ్చిన 66 సంవత్సరాల వృద్దునికి సకాలంలో ఉచితంగా నలభైవేల రూపాయిల ఖరీదైన టెనెక్టెరెల్ 40ఎంజి ఇంజెక్షన్ ఇచ్చి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు ప్రాణాన్ని కాపాడారు. మండలంలోని రుస్తుంబాద వివర్స్ కాలనీలో నివసిస్తున్న వాస సుబ్రమణ్యం అనే 66 సంవత్సరాల వృద్దునికి సోమవారం ఆకస్మత్తుగా ఛాతీ ఎడమవైపున తట్టుకోలేని నొప్పి వచ్చింది, ఛాతీ నొప్పి తగ్గకపోవడంతో వారి బందువులు వెంటనే దగ్గరలోని నర్సాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు.వెంటేనే డా.కె.జాన్ హరిసన్ డా.కె.లీలా మారుతి పేషెంట్‌ని పరిశీలించి ఈసిజి పరీక్ష సహాయంతో గుండెపోటు అనగా థ్రోంబోలిసిస్ మయోకార్డియల్ ఇన్ఫార్జన్,యస్‌టి సెగ్మెంట్ ఎలివేషన్ మయోకార్డియల్ ఇన్ఫార్మన్ (స్టెమి)గా నిర్ధారించారు. వెంటనేడా.కె.జాన్ హరిసన్, డా.కె.లీలా మారుతిఆసుపత్రి సూపరింటెండెంట్ సుప్రియాఆసుపత్రిలో అందుబాటులో ఉన్న అత్యంత ఖరీదైన సలబై వేల రూపాయిల టెనెక్టెరెల్ 40ఎంజి ఇంజెక్షన్‌ని గుండెపోటుతో బాధపడుతున్న వాస సుబ్రమణ్యంకు ఉచితంగా అందించడంతో ప్రాణాపాయం తప్పింది. ప్రభుత్వ ఆసుపత్రిలో ఇటువంటి వైద్యం చేయటం ఇదే మొదటి సారి. ధైర్యంగా ఇంజక్షన్ ఇచ్చి ప్రాణాలు కాపాడిన డాక్టర్లను పలువురు అభినందించారు. పేషెంట్‌ని కొంత సమయం పరిశీలనలో ఉంచి మెరుగైన వైద్యం కోసం 108 అంబులెన్స్‌లో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు పేషెంట్‌ని వెంటనే జాయిన్ చేసుకొన్నారని, ప్రస్తుతం పేషెంట్ పరిస్థితి నిలకడగా ఉన్నదని పేషెంట్ బందువులు ఆసుపత్రి సూపరింటెండెంట్ డా సుప్రియాకి తెలియజేశారు.

యువతకు ఉచిత శిక్షణ

ఏలూరు,మేజర్స్యూస్ : జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు స్థానిక డి.యల్.టి.సి సహాయ సంచాలకులు ఎస్.ఉగాది రవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానమంత్రి కౌశల్ వికాశ్ యోజన క్రింద 'ఫీల్డ్ టెక్నీషియన్–ఎయిర్ కండిషనర్' కోర్సులో 3 నెలల పాటు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. 10వ తరగతి ఆపైన ఉత్తీర్ణులైన వారు 18 నుంచి 35 ఏళ్లలోపు వారు అర్హులని తెలిపారు. చివరి తేదీ ఈనెల 20. వివరాలకు: 9493482414. నెంబర్లను సంప్రదించవచ్చన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా బహుళ అంతస్తులు

చోద్యం చూస్తున్న పంచాయతీ

కైకలూరు,మేజర్స్యూస్: నియోజకవర్గ కేంద్రమైన కైకలూరు పట్టణంలో అక్రమ కట్టడాలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. అక్రమార్కులకు అడ్డుకట్ట వేసేవారే లేకుండా పోయారు. ఏ వీధిలో చూసినా రోడ్లను కబ్జా చేస్తూ.. పార్కింగ్‌కు సెల్లార్లను వదిలేయకుండా. బాల్కానీలను పెంచి బహుళ అంతస్థులు నిర్మిస్తున్నారు. అనుమతులు ఒకదానికి తీసుకుంటూ.. నిర్మాణాలు మరో విధంగా చేపడుతున్నారు. ప్రధానంగా టౌన్ హాల్ దగ్గర మెయిన్ రోడ్డు ప్రక్కన కడుతున్న భవనమే నిదర్శనం. ఇంతజరుగుతున్నా పంచాయితీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. అధికారులు కార్యాలయాలకే పరిమితం కావడంతో అక్రమ కట్టడాలు కొనసాగుతూనే ఉన్నాయి. క్షేత్రస్థాయిలో అక్రమ కట్టడాలను గుర్తించాల్సింది పోయి తమకేమీ పట్టనట్లుగా వ్యవహరించడంతో పలు అనుమానాలకు తావిస్తోంది. పంచాయితీ పరిధిలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం జి ప్లస్ టూకే అనుమతి అని ప్రకటించినా అక్రమార్కులు 5 అంతస్థులు భవన నిర్మాణాలుచేపడుతున్నారు. కొందరు జి ప్లస్ టుకు అనుమతి తీసుకొని ఐదు అంతస్థుల భవనాలను నిర్మిస్తున్నారు.

ఈ ఏదన్నా ప్రమాదం సంభవిస్తే ఫైర్ ఇంజన్ తిరిగే ప్లేస్ కూడా లేకుండా తప్పుడు అనుమతులతో ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్న వారిపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నిద్ర మత్తులో తూగుతున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి.

మామూళ్లకు అలవాటు పడి అక్రమ నిర్మాణాలను అడ్డుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. కొందరు పార్కింగ్‌కు సెల్లార్స్ వదిలేయ కుండా బహుళ అంతస్తుల నిర్మాణంచేపట్టియథేచ్ఛగాఅద్దెకు ఇచ్చుకుంటున్నారు. ఇప్పట*కైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలపై కొరడా ఝుళిపించాలని స్థానికులు కోరుతున్నారు.ఏదిఏమైనా అక్రమ కట్టడాల నిర్మాణాలకు కైకలూరు పంచాయతీ అధికారులు నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకుంటారో ? చేతులు దులుపుకుంటారో వేచి చూడాలి.

విద్యావేత్త జంగా గోపాల్ కన్నుమూత

– ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ నివాళి

తాడేపల్లిగూడెం,మేజర్ న్యూస్: పట్టణంలో పలు విద్యాసంస్థలు స్థాపించి వేలాదిమంది విద్యార్థులను తీర్చిదిద్దిన ప్రముఖ విద్యావేత్త,పట్టణ ప్రముఖులు జంగా గోపాల్ (87) మంగళవారం ఉదయం ఏలూరులోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో కన్నుమూశారు. బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో ఆయనను గతవారం ఏలూరులోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చారు. చికిత్స పొందుతూ ఆయన మంగళవారం తెల్లవారు జామున తుదిశ్వాస విడిచారు. జంగా గోపాల్ భౌతిక కాయాన్ని ఏలూరు నుండి మంగళవారం ఉదయం 10 గంటలకు కింబర్లీ విద్యాసంస్థల ఆవరణకు తీసుకు వచ్చారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ జంగా గోపాల్ భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు.

నర్సాపురం ఎంపీడీవో అదృశ్యం

– పెనమలూరులో పోలీసులకు ఫిర్యాదు చేసిన భార్య
– వైసీపీ నాయకుడు ప్రభుత్వానికి రావలసిన బకాయి చెల్లించకపోవడం వల్ల ఆందోళనకు గురైనట్లు ఫిర్యాదు

నర్సాపురం రూరల్,మేజర్ న్యూస్: మండల పరిషత్ ఆధీనంలో గల తూర్పు పశ్చిమగోదావరి జిల్లాల నిర్వహణలో కొనసాగుతున్న మాధవాయిపాలెంపెర్రీవైసీపీకి చెందిన రెడ్డప్పదవేజిపాట పాడుకున్నారు. ప్రతి ఏటాఈరేవులో రాకపోకలు నిర్వహించేందుకు నరసాపురం మండల పరిషత్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహిస్తారు. వచ్చే ఆదాయాన్ని నరసాపురం, సఖినేటిపల్లి మండల పరిషత్తులు సగం సొమ్మును అభివృద్ధికి వినియోగించుకోగా, మిగిలిన భాగాన్ని తూర్పు పశ్చిమగోదావరి జిల్లా పరిషత్తులు తీసుకుంటాయి. ప్రతి ఏటా కోట్లలోనే ఆదాయం వస్తుంది. వైసీపీ పార్టీ అధికారంలో ఉండటంతో ప్రజా ప్రతినిధులు, అధికారులతో స్టీరింగ్ కమిటీని ఏర్పాటు చేశారు.సఖినేటిపల్లి,నరసాపురాలకుచెందిన ఎంపీపీలు,ఎంపీడీవోలు, డిఎల్‌పిఓ లు తదితరులు ఈ కమిటీలో ఉంటారు. వీరి పర్యవేక్షణలోనే ప్రయాణికుల నుండి ఎంత వసూలు చేయాలి అనే దానిని నిర్ధారిస్తారు. గత 4నెలలుగా ప్రభుత్వానికి చెల్లించవలసిన రూ.54 లక్షలను పాటదారుడు చెల్లించలేదు.ఎన్నిసార్లు చెప్పినప్పటికీ పెడచెవిన పెట్టారు. శాఖపరమైన చర్యలు తీసుకునేందుకు ఇరుజిల్లాల ప్రతినిధులతో ఏర్పాటుచేసిన స్టీరింగ్ కమిటీలో వైసీపీ నాయకులే ఉండటంతో ఉదాసీనంగావ్యవహరించారని అంటున్నారు. జనవరి 24న ఎంపీడీవో గా బాధ్యతలు చేపట్టిన ఎంవి రమణారావు, ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలోకి వెళ్లిపోయారు. పాటదారునికి ఫోన్ చేయటం మినహా ఎటువంటి చర్యలు తీసుకునేందుకు ఒకపక్క స్టీరింగ్ కమిటీ, మరోపక్క అధికార వైసిపిఅడ్డుగానిలిచింది. అయినప్పటికీ జిల్లా ఉన్నతాధికారులకు ఎంపీడీవో ఈ విషయంపై ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం మారటంతో బకాయి విషయం ఆరా తీస్తారుఅనే ఆందోళన ఎంపీడీవోలో కనిపించేది. రిటైర్మెంట్‌కు దగ్గరగా ఉండటంతోఏక్షణాన ఏం జరుగుతుం దో అనే ఆందోళన ఎంపీడీవోలో కనిపించేది. ఈ నేపథ్యంలో ఈ నెల మూడు నుండి 20వ తేదీ వరకు సెలవు పెట్టి వెళ్లారు. సోమవారం నుండి ఆయన కనిపించకపోగా, వ్యక్తిగత ఫోన్ నెంబర్లు కూడా ప్రభుత్వ ఫోన్‌కు కలపడంతో ఇన్చార్జ్ ఎంపిడి ఓగా కొనసాగుతున్న వీరభద్రరావుకు బంధువుల నుండి ఒత్తిడి పెరిగింది. కుటుంబ సభ్యులు బంధువుల నుండి కూడా ప్రభుత్వ ఫోన్ నెంబర్‌కు ఫోన్లు రావటంతో సమాధానం చెప్పలేక సతన్నతమవుతున్నారు. ఈ నేపథ్యంలో తన భర్త కనిపించడం లేదంటూ ఎంపీడీవో భార్య కృష్ణా జిల్లా పెనమలూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వైసీపీకి చెందిన రెడ్డప్పద వేజి ప్రభుత్వానికి చెల్లించవలసిన బకాయి చెల్లించకపోవడంతో తన భర్త ఆందోళనకు గురై అదృశ్యమయ్యారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇదే ఫెర్రీ విషయంలో నిబంధనలను పాటించకపోవడంతో గతంలో ఎంపీడీవోగా పనిచేసిన ఎంసీ కోటయ్య సస్పెండ్ అయ్యారు.

మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్‌కు ఇద్దరు న్యాయవాదుల నియామకం

ఏలూరు,మేజర్స్యూస్: ఏలూరు నగర మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కౌన్సిల్‌గా పేరాబత్తిన సాయి రమేష్,అంబుల వెంకటనారాయణను నియమిస్తూ ఏలూరు మున్సిపల్ కమిషనర్ వెంకటకృష్ణ ఉత్వరులు జారీ చేశారు. వారి పదవీకాలం మూడు సంవత్సరాలు ఉంటుందని తెలియజేశారు. ఈ సందర్భంగా న్యాయ వాదులు ఇద్దరినీ నియమించినందుకు వారు ఎమ్మెల్యే బడేటీ రాధాకృష్ణని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

ఎంపి పుట్టా ,ఎమ్మెల్యేలు చింతమనేని, మద్దిపాటి చిత్రపటాలకు పాలాభిషేకం

పెదవేగి,మేజర్ న్యూస్: గత ఎన్నికల్లో ఏలూరు ఎంపీ అభ్యర్థిగా ప్రచారం చేస్తున్న పుట్టా మహేష్ కుమార్ యాదవ్ దెందులూరు నియోజకవర్గం నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు తమకు ద్వారకాతిరుమలలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి స్థలం కావాలని అభ్యర్థించారు. ఎన్నికల్లో గెలిచిన వెంటనే స్థలం కేటాయింపునకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆపై ఎంపీగా విజయం సాధించిన పుట్టా మహేష్ కుమార్ యాదవ్ తాను ఇచ్చిన హామీ విషయాన్ని మరువకుండా నాయీ బ్రాహ్మణుల కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి అనువుగా స్థలం కేటాయింపునకు చర్యలు తీసుకున్నారు. ద్వారకాతిరుమలలో నాయీ బ్రాహ్మణుల కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి అవసరమైన స్థలం కేటాయింపునకు గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజుకు ఎంపీ సూచించారు. దీంతో ద్వారకాతిరుమలలో నాయీ బ్రాహ్మణుల కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి 50సెంట్ల స్థలాన్ని కేటాయించారు. దీనిపై నాయీ బ్రాహ్మణులు హర్షం వ్యక్తంచేస్తూ పెదవేగి మండలం విజయరాయి లోని నాయీ బ్రాహ్మణుల సంఘం కార్యలయం ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్,ఎమ్మెల్యేలు చింతమనేని ప్రబాకర్, మద్దిపాటి వెంకటరాజు చిత్రపటాలకు పాలాభిషేకం చేసి,తమ అభిమానాన్ని చాటుకున్నారు. సంఘం సాధికార కమిటీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు కొప్పెర్ల నాగరాజు,దెందులూరు నియోజకవర్గం నాయకుడు కొప్పెర్ల దావీదు, టీడీపీ నాయకులు గిరిబాబు సత్యం,కృష్ణ,రాజు, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

దాతృత్వం చాటుకున్న ఎమ్మెల్యే బొలిశెట్టి

తాడేపల్లిగూడెం,మేజర్ న్యూస్: తాడేపల్లిగూడెం పట్టణంలోని వీకర్స్ కాలనీకి చెందిన గొల్ల రమణ కుమారుడు గొల్ల రాజేష్ 15కు రెండు కిడ్నీలు పాడైపోవడంతో ఆర్థిక పరిస్థితి బాగోలేని పరిస్థితిలో ఉన్నప్పుడు ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనువాస్‌ని కలిశారు. ఆయన తాడేపల్లిగూడెం ఏరియా హాస్పిటల్ సూపర్డెంట్ తో మాట్లాడి అక్కడ నుంచి మంచి వైద్యం గుంటూరులోనే జిజిహెచ్ హాస్పిటల్ నందు అందించాలని తక్షణ ఆదేశాలు జారీ చేశారు.దీనితో పాటుగా తక్షణ ఆర్థిక సాయం కింద రూ.10వేలు వారికి అందించి,ఏ విధమైన సహాయ సహకారాలు కావాలన్న మా పార్టీ కార్యాలయం సంప్రదించవచ్చని హామీ ఇచ్చి వారికి మానసిక ధైర్యాన్ని ఇచ్చారు.

వీధిలైట్లు, డ్రైన్‌లను పరిశీలించిన కమిషనర్

నరసాపురం,మేజర్ న్యూస్: పట్టణంలోని స్టీమర్ రోడ్‌లో డ్రైన్లపై ఉన్న మూతలను, డ్రైన్లలో ఉన్న నీటిని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు మంగళవారం పరిశీలించారు. వర్షాకాలం కావడంతో మురుగునీరు సాఫీగా వెళ్లేందుకు చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖ అధికారులను ఆయన ఆదేశించారు. పట్టణంలోని పలు ప్రాంతాలలో డ్రైన్ల సమీపంలో ఉన్న గుంటలను పూడ్చాలని, వర్షం వచ్చే సమయంలో వాహనదారులు ప్రమాదాలకు గురికాకుండా చర్యలు చేపట్టాలని ఆయన అన్నారు. అనంతరం ప్రకాశం రోడ్ లో హైడ్రాలిక్ లేడర్ లతో మరమ్మతులు చేపడుతున్న వీధిలైట్లను కమిషనర్ పరిశీలించారు. పట్టణ ప్రాంతంలోని అన్ని లైట్లు వెలిగేలాగా చర్యలు చేపట్టాలనిఆయన అన్నారు.

27 మందికి ఇండియన్ ఎయిర్ ఫోర్స్ ఉద్యోగాలపై అవగాహన

ఏలూరు,మేజర్ న్యూస్: కోవిడ్ కారణంగా తల్లిదండ్రులును కోల్పోయి అనాధలుగా మిగిలి పోయిన 55 మంది బాలలలో 18 సం.లు వయస్సు దాటిన 19 మంది బాలల కూ, ఇంటర్మీడియట్ పూర్తి చేసి వృత్తి విద్యలలో పాల్గొనలనుకునే 8 మంది బాలలు మొత్తంగా 27 మందికి ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లో అందుబాటులో ఉన్న రిక్రూట్మెంట్ నోటిఫికేషన్ గురించి ఎయిర్ ఫోర్స్ నాన్ కమాండెడ్ ఆఫీసర్ ఎన్ సందీప్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు, స్థానిక కలెక్టరేట్ గౌతమీ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కె.వేట్రి సెల్వి మాట్లాడుతు పిల్లలు వారి వారి కాళ్ళ మీద వారు నిలబడే విధముగా తీర్చిదిద్దు కోవటానికి కేవలం ఇంటర్మీడియట్ అర్హతతో ఎయిర్ ఫోర్స్‌లో ఇంత మంచి అవకాశం రావటం అదృష్టమన్నారు. ఈ కార్యక్రమంలో పిడి ఐసీడీఎస్ కె పద్మావతి,జిల్లా బాలల సంరక్షణ అధికారి డాక్టర్ సిహెచ్ సూర్య చక్ర వేణి పాల్గొన్నారు.

వైసిపి బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలి

– అప్పడా మాజీ వైస్ చైర్మన్ రఘురామ్

తాడేపల్లిగూడెం,మేజర్ న్యూస్: ఏపీ అప్పడా మాజీ వైస్ చైర్మన్ వడ్డీ రఘురామ్ నివాసంలో తాడేపల్లిగూడెం మండలం నీలాద్రిపురం గ్రామానికి చెందిన యువకులు ఆయనతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలో నెలకొన్న రాజకీయ పరిస్థితుల గురించి వడ్డీ రఘురాముకు యువకులు వివరాలు తెలిపారు. గ్రామ స్థాయిలో వైసిపి బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి ముత్యాల ఆంజనేయులు, ఆరేళ్ల గ్రామ సర్పంచ్ మాకరాజు సతీష్, కృపావరం, తదితరులు పాల్గొన్నారు.

వాయు కాలుష్య నియంత్రణకు పటిష్ట ప్రణాళిక

ఏలూరు,మేజర్ న్యూస్: ఏలూరు నగరంలో వాయు కాలుష్య నియంత్రణకు పటిష్టమైన ప్రణాళిక రూపొందించి సమర్పించాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. నేషనల్ క్లియర్ ఎయిర్ ప్రోగ్రాం కింద కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో వాయుకాలుష్య నియంత్రణ అమలుపై ఏర్పాటైన జిల్లా స్థాయి కమిటీ సమావేశం స్థానిక కలెక్టరేట్లోని గౌతమీ సమావేశపు హాలులో మంగళవారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జాతీయ హరిత ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి దేశంలోని వాయుకాలుష్యం కలిగిన నగరాలలో కాలుష్య నియంత్రణకు ప్రణాళికబద్ధముగా చర్యలు తీసుకోవాలని ఆదేశించినదన్నారు. వాటిలో ఏలూరు నగరం ఒకటని, ఏలూరు వంటి చిన్న స్థాయి నగరంలో వాయు కాలుష్యం వ్యాపించడంపై మూలకారణాలు తెలుసుకుని, వాటిని నియంత్రించేందుకు అవసరమైనకార్యాచరణ ప్రణాళికను రూపొందించి వెంటనే సమర్పించాలని కలెక్టర్ కాలుష్య నియంత్రణ మండలి అధికారులను ఆదేశించారు. వాహనాలకు వినియోగించే ఇంధనం కల్తీ లేకుండా చూడాలని,ప్రతీ పెట్రోల్ బంక్ లలో సరఫరా అయ్యే ఇంధనం నిబంధనల మేరకు ఉన్నదాలేదాఅన్నదిఅధికారులుతనిఖీ చేయాలన్నారు.

– సమావేశానికి హాజరు కానీ అధికారులకు షోకాజ్ నోటీసులు –

కలెక్టర్ జిల్లాలో పలు సమీక్షా సమావేశాలకు జిల్లా స్థాయి అధికారులు హాజరుకావడం లేదని ఇది సరైన పద్ధతి కాదని కలెక్టర్ చెప్పారు. కొంతమంది జిల్లా అధికారులు తాము సమావేశానికి హాజరు కాకుండా తమ కింద స్థాయి అధికారులను సమావేశాలకు పంపిస్తున్నారన్నారు. అత్యవసర పరిస్థితిలో ఉన్నవారు సమావేశానికి హాజరు నుండి మినయయింపునకు అనుమతితీసుకోవలసి ఉందన్నారు. సమావేశానికి హాజరు కానీ అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలనీ కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో కాలుష్య నియంత్రణ మండలి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.వెంకటేశ్వరరావు, కన్సల్టెంట్ ఏ.కోమలి,సామజిక వన విభాగం జిల్లాఅటవీశాఖాధికారి ఎం.హిమ శైలజ,ఏలూరు నగరపాలక సంస్థ కమీషనర్ ఎస్. వెంకటకృష్ణ, జిల్లా పౌర సరఫరాల అధికారి ఆర్.ఎస్.సత్యనారాయణ రాజు, జిల్లా పరిశ్రమల అధికారి వి.ఆదిశేషు, ఆర్టీవో శ్రీహరి, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జి. శైలజ, రహదారులు భవనాల శాఖ ఈ ఈ కిషోర్ బాబూజీ, ప్రభృతులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కార్యకర్తలుకు మిషన్ శక్తిపై అవగాహన

అగిరిపల్లి,మేజర్ న్యూస్: మండల కేంద్రమైన అగిరిపల్లి కొండాకాలనీ ఎంపిపి పాఠాలలో మంగళవారం అంగన్వాడీ కార్యకర్తలుకువంద రోజుల ప్రత్యేక మిషన్ శక్తిపై అవగాహన కార్యక్రమంలో భాగంగా నూజివీడు సీడీపీఓ ఎస్ నురాని అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ మహిళాలు, ఆడపిల్లలకు రక్షణ, సంరక్షణ కల్పించటం, వారికీ అవసరమైన విషయాన్ని,సమాచారాన్ని అందించి,వారి సమగ్రభివృదే మిషన్ శక్తి ముఖ్య ఉద్దేశ్యంమని పేర్కొన్నారు. 181మహిళల హెల్ప్లైన్ ,1098పిల్లల హెల్ప్ లైన్ను వినియోగించు కోవాలని, ఆడపిల్లలను రక్షించండి, ఆడపిల్లలను చదువించండిఅని తదితర కార్యక్రమాల గురించి వివరస్తూ, పిల్లల పెరుగుదల పై శిక్షణ నిర్వహించారు. వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అతిధిగా పాల్గొన్న మానవ హక్కుల కమీషన్ సంస్థ(ఎన్జివో) వ్యస్థాపక అధ్యక్షులు డి.దాసు మాట్లాడుతూ మానవ హక్కులు మరియు వినియోగదారుల హక్కుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలోఎసీడీపీఓడివి వి.నాగేశ్వరి,సూపర్వై జర్ జి.రాగమయి,ఎల్ సులోచన రాణి,మండలంలోని అందరు అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

డెంగ్యూ,అతిసార వ్యాధులు అరికట్టేందుకు చర్యలు

– డీపీఓ శ్రీనివాస విశ్వనాధ్

జీలుగుమిల్లి,మేజర్న్యూస్ : కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశాలు మేరకు జిల్లాలో స్టాప్ డయేరియా ప్రచారం విస్తృతంగా జరుగుతుందని జిల్లా గ్రామ పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాధ్ అన్నారు. మంగళవారం జీలుగుమిల్లి మండలం, తాటియాకుల పాలెం గ్రామ పంచాయతీ ఆకస్మికంగా తనిఖీ చేసి మండలంలో జరుగుతున్న పారిశుధ్య కార్యక్రమాలు, ఓ.హెచ్.ఆర్ త్రాగునీరు ట్యాంకు పరిశీలించి పంచాయతీ రాజ్ సిబ్బందితో సీజనల్ వ్యాధులపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా డీపీఓ శ్రీనివాస విశ్వనాధ్ మాట్లాడుతూ ఓ.హెచ్.ఎస్.ఆర్ ట్యాంకులను క్రమం తప్పకుండా ప్రతి 15 రోజులకు ఒకసారి శుభ్రం చేయించి పంచాయతీ సెక్రటరీ ధ్రువీకరణ పత్రాన్ని అందజేయాల్సి ఉందన్నారు. త్రాగునీటి శాంపిల్స్ సంబంధిత ల్యాబ్ నందు టెస్టింగ్ జరుగుతుందో లేదో పర్యవేక్షించాలన్నారు. ఓ.హెచ్.ఆర్.ఎస్ ట్యాంక్ స్టైయిర్ కేస్ ప్యానల్స్ ఖాళీలు లేకుండా మరమ్మతులు చేయించాలన్నారు. ఈవోపీఆర్డి పంచాయతీ సెక్రెటరీ ప్రతిరోజు గ్రామాలలో పారిశుభ్రతను మానిటర్ చేయాలని ఆదేశించారు. పంచాయతి సెక్రటరీ, ఈఓపిఆర్డి ఏ ఏ ప్రాంతాల్లో చెత్త పోగుపడుతుందో గ్రహించి తరలింపుకు చర్యలు తీసుకోవాలన్నారు. పైపులైన లీకేజీలు అరికట్టకపోతే త్రాగునీరు కలుషితమయ్యి డయేరియా ప్రబలుతుందని వెంటనే లీకేజీలను అరికట్టడానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆగస్టు 31 వరకు 'స్టాప్ డయేరియా కాంపెయిన్' నినాదంతో డయేరియా నియంత్రణపై ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగితుందని వివరించారు. ఈ కార్యక్రమంలో విస్తరణ అధికారి టి.నిఖిల్, పంచాయతీ కార్యదర్శి వీరలక్ష్మి, జి.నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

బాబ్జి ఆధ్వర్యంలో 90వ వారం అన్న క్యాంటీన్ అన్నదానం

తాడేపల్లిగూడెం,మేజర్ న్యూస్: 90 వారాలుగా తాడేపల్లిగూడెంలో నిర్వహిస్తున్న అన్నా క్యాంటీన్ అన్నదానానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ విచ్చేశారు. స్థానిక తాలూకాఫీస్ సెంటర్లో అన్నదాన కార్యక్రమం 90 వారానికి చేరింది. ఈ అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ 89 వారంల్లో తెలుగుదేశం శ్రేణులుకి అవకాశం కల్పించారనీ తెలిపారు. 90వ వారం నా ఖర్చుతో చేయాలని అనగా ఈ వారం అన్నదాన కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. వచ్చే నెల మా అమ్మగారి జ్ఞాపకార్థం అన్నదాన కార్యక్రమం నిర్వహించాలని తెలుగుదేశం శ్రేణులని కోరారు. త్వరలో ప్రభుత్వం అన్ని మండలాల్లోనూ,అన్ని జిల్లాల్లోనూ అన్నా క్యాంటీన్లు పునర్ధరించి ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం,రాత్రి భోజనం కేవలం ఐదు రూపాయలకే అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే బొలిశెట పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ వలవల బాబ్జి, బిజెపి ఇన్చార్జ్ ఈతకోట తాతాజీ,ఉమ్మడి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చేపల మార్కెట్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన ఎస్ఎంఆర్

ఏలూరు,మేజర్ న్యూస్: కొనుగోలు దారులు,కొందరు వ్యాపారస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నగరపాలక సంస్థ కో–ఆప్షన్ సభ్యులు ఎస్ ఎం ఆర్ పెదబాబు మంగళవారం ఉదయం మెయిన్ బజార్‌లోని చేపల మార్కెట్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. కొనుగోలుదారులు మార్కెట్లోకి నడుచుకుంటూ వెళ్లడానికి కూడా వీలులేని విధంగా వ్యాపారస్తులు వారి షాపులు లోపల నుండి డ్రైనేజీ దాటుకొని రోడ్డుకుసగం వరకు బయటకు వచ్చి వ్యాపారాలు నిర్వహించడం గమనించారు. కోళ్లు వ్యాపారస్తులు షాపుల్లో కాళీ బుట్టలు పెట్టుకొని రోడ్లమీదవ్యాపారాలు చేస్తున్నారు. ఈ కారణంగా కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు, దీంతో తక్షణమే ఆక్రమణలను తొలగించి ప్రతిరోజు డ్రైనేజీలు తీసే విధంగా చర్యలు తీసుకోవాలని కో–ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు అధికారులను ఆదేశించారు ఏసిపితిరుపతిరావు,టిపిఎస్‌సాంబ,నాగ మల్లేశ్వరరావు, సానిటరీ ఇన్స్పెక్టర్ తుంపాల రాజగోపాల్, పలువురు వ్యాపారస్తులు ఉన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

పెనుగొండ,మేజర్న్యూస్: ఉచిత కంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పెనుగొండ గ్రామ సర్పంచ్‌నక్కా శ్యామలా సోనీ శాస్త్రి అన్నారు. మంగళ వారం పెనుగొండ గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఉచిత కంటి వైద్య శిబిరమును ప్రారంభించారు. స్కోజో ఫౌండేషన్ వారి ద్వారా తణుకు కు చెందిన డాక్టర్ జీ అజోరే వారి ఆధ్వర్యములో పెనుగొండ గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమములో ఆప్తమాలజిస్ట్ ఎం విజయ్ కుమారి,పిఆర్ ఓ బొక్కవెంకట రమణ పాల్గొన్నారు. వైద్య శిబిరములో 40 మందికి పైగా ప్రజలకు ఉచితంగా హ్రస్వ దృష్టి, పార్శ్వ దృష్టి, కంటిలో శుక్లాలు, కంటినుండి నీరు కారుట, పుసులు కట్టుట మొదలగు సమస్యలు వున్న వారికి కంటి పరీక్షలు ఉచితముగా చేసి 13 మందికి కంటికి సంబంధించిన కంటి డ్రాప్స్ ,మందులు ఉచితముగా అందించారు. కంటి అద్దాలు అవసరమైన 20 మదికి సబ్సిడీ ద్వారా కంటి అద్దాలు అందించారు. దృష్టి కోల్పోయి ఆపరేషన్లు అవసరమైన 7 గురికి ఎల్.వి కంటి ఆసుపత్రి వారి ద్వారా ఉచితముగా ఆపరేషన్లు చేయించుటకు అంగీకరించారు .కార్యక్రమములో వార్డు సభ్యులు బండారు కృష్ణమూర్తి,మండ సత్య సూర్య ప్రసాద్,చిట్నీడి రామస్వామి ,పులుగోరు రవికుమార్,కాకి బాల వెంకట సత్యా ప్రభాకర్ , చిట్టూరి పూర్ణ చంద్రశేఖర్,బాలం కనక దుర్గ,వేంద్ర మంగ,చేవూరి శ్రీదేవి,దొమ్మేటి దేవి,మేడపాటి నీలిమా రాణి ,అయినవల్లి పద్మావతి, గ్రామ పంచాయతీ కార్యదర్శి టి.రత్నాకర రావు, పంచాయతీ జూనియర్ అసిస్టెంట్లు డిఎంమహంతి,జి.భార్గవ్ నాయుడు, రమణ,పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఇండియన్ ఎయిర్ ఫోర్స్ రిక్రూట్ మెంట్-2024

ఆన్ లైన్లో ధరఖాస్తు చేసుకోండి : జిల్లా కలెక్టర్

ఏలూరు,మేజర్ న్యూస్: ఇండియన్ ఎయిర్ ఫోర్స్ రిక్రూట్ మెంట్ కోసం ఆసక్తిగల అభ్యర్థులు జూలై, 24వ తేది వరకు ఆన్ లైన్లో ధరఖాస్తు చేసుకోవచ్చునని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో ఎయిర్ ఫోర్స్ అధికారి ఎన్. సంధీప్ ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లో అగ్నివీర్ వాయువు రిక్రూట్ మెంట్ గురించి అధికారులకు వివరాలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ అగ్నివీర్ వాయువు రిక్రూట్ మెంట్ కు సంబంధించి జూలై 24వ తేదీ వరకు ఆన్ లైన్లో ధరఖాస్తు చేసుకునే విధంగా అన్ని కళాశాలల్లో 17.5 సంవత్సరాల నుంచి 21 సంవత్సరం లోపు వయస్సు కలిగిన విద్యార్థులకు అవగాహన కల్పించాలని జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసరుకు సూచించారు. ఎయిర్ ఫోర్స్ అధికారి ఎన్. సంధీప్ మాట్లాడుతూ ఇండియన్ ఎయిర్ ఫోర్స్ లో అగ్నివీర్ వాయువు

రిక్రూట్ మెంట్ సంబంధించి ఇతర వివరాలను https://agnipath-vayu. cdac.in వెబ్ సైట్‌లో పొంది రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. అక్టోబరు 18 నుంచి ఆన్ లైన్లో పరీక్షలు నిర్వహించబడతాయన్నారు. సమావేశంలో జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి జి. ప్రవీణ్ కృష్ణ, సెబ్ వెల్ మేనేజరు పి.వి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ ఏజెన్సీల ద్వారా మాత్రమే గల్ఫ్‌కి వెళ్ళేందుకు చర్యలు

– ఉపాధి పొందేందుకు వెళ్లే మహిళలకు శిక్షణ
– జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

భీమవరం,మేజర్ న్యూస్: గల్ఫ్ దేశానికి ఉపాధి కోసం వెళ్లి ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్న మహిళా వర్కర్ల ఆవేదనను ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా తెలుసుకున్న జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి గల్ఫ్ వలస కారణంగా ఏ మహిళ మోసపోకూడదనే లక్ష్యంతో చర్యలను వేగవంతంగా ప్రారంభించారు. ఈ విషయమై మంగళవారం పశ్చిమగోదావరి జిల్లా భీమవరం కలెక్టర్ చాంబర్ ముందు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ ఏపీ లిమిటెడ్ ప్రతినిధులు, సంబంధిత అధికారులతో సమావేశమై గల్ఫ్ సురక్షిత వలసలపై సమీక్షించారు. జిల్లాలో ఉపాధి మార్గాలు మెండుగా ఉన్నాయని మహిళలు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కుటుంబ సభ్యులకు దూరమై సుధూర ప్రాంతాలకు వెళ్లేవారు జిల్లాలో ఉపాధి మార్గాలపై ఆలోచన చేయాలన్నారు. గల్ఫ్ వెళ్లాలని కృత నిశ్చయంతో ఉన్న మహిళలు ఏజెన్సీల ద్వారా మోసపోకుండా నైపుణ్యాన్ని పెంపొందించే శిక్షణతో పాటు సురక్షితమైన మార్గం ద్వారా గల్ఫ్ కు పంపేందుకు కార్యాచరణ రూపొందించి అమలకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లాలో తొలుత "గల్ఫ్ వర్కర్స్ సహాయ కేంద్రం" ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఆగస్టు ఆరవ తేదీన గుర్తింపు పొందిన, పొందని ఏజెన్సీలతో వర్క్ షాప్ నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ ఏపీ లిమిటెడ్ జనరల్ మేనేజర్ బి.ఆర్ క్రాంతి కుమారి, హెచ్ ఆర్ మేనేజర్ బి.సతీష్ బాబు, సీనియర్ అసిస్టెంట్ జి.గోపి, డిఆర్డిఏ పిడి ఎమ్మెస్ఎస్ వేణుగోపాల్, జిల్లా కార్మిక శాఖ అధికారి ఆకన లక్ష్మి, ఐసిడిఎస్ పిడి బి.సుజాత రాణి, జిల్లా నైపుణ్య శిక్షణ అభివృద్ధి అధికారి కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగ తగిలి షాక్‌కు గురై విద్యార్థి మృతి

పోలవరం,మేజర్న్యూస్ : సరదాగా స్నానానికి వెళ్లి విద్యుత్ షాక్‌కి గురై విద్యార్థి మృతి చెందిన సంఘటన పోలవరం మండల కేంద్రంలో పాత పోలవరం వద్ద మంగళవారం జరిగింది. ఎస్ఐ పవన్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం పాత పోలవరం గ్రామానికి చెందిన కోవేటి ప్రసాద్ (11) ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. స్కూల్‌కి సెలవు కావడంతో స్నేహితులతో కలిసి పాండురంగస్వామి గుడి వైపు ఆడుకోవడానికి వెళ్ళగా,అప్పటికే తెగిపడి వున్న విద్యుత్ తీగ తగిలి విద్యుత్ ఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. విద్యార్థి తండ్రి పోసి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలవరం ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ విషయంపై విద్యుత్ శాఖ ఏఈ కొండ సత్యనారాయణ ని వివరణ కోరగా తెగిపడిన వైరు న్యూట్రల్ వైరని సాధారణ నేల మీద అయితే ఎలాంటి ప్రమాదం ఉండదని నేల తడిగా ఉండటం వలన విద్యుత్ ఘాతానికి గురైనట్లు ధ్రువీకరించారు. విద్యుత్ ఘాతానికి గురై మృతి చెందిన బాలుడి కుటుంబానికి విద్యుత్ శాఖ తరపున నష్టపరిహారం అందించేందుకు తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మిరప రైతులకు అవగాహన సదస్సు

– ఐ కార్ –కేంద్ర పొగాకు పరిశోధనా కేంద్రం

జీలుగుమిల్లిలో,మేజర్ న్యూస్: 'గిరిజన ప్రణాళిక 2024 – 2025'లో భాగంగా "మిరప పంటలో సస్యరక్షణ చర్యలపై రైతు అవగాహన సదస్సు"ను సిటిఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ ఎం.శేషు మాధవ్ ఆదేశాల మేరకు సిటిఆర్ఐ జీలుగుమిల్లి హెడ్ డాక్టర్ వై వి సుబ్బయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుబ్బయ్య మాట్లాడుతూ వాణిజ్య పంటలలో పొగాకు పంటకు దీటుగా రైతులకు అధిక ఆదాయాన్ని ఇచ్చే పంటగా మిరప నేడు ప్రధాన పంటగా సాగు చేయబడుతుందని ,ఎగుమతికి అనుకూలముగా ఉన్న రకాలను సాగు చేసి రైతులు అధిక ఆదాయం పొందాలని సూచించారు. సిటిఆర్ఐ ప్రధాన శాస్త్రవేత్త,గిరిజన ఉపప్రణాళిక చైర్ పర్సన్ డాక్టర్ సుమన్ కళ్యాణి మాట్లాడుతూ సిటిఆర్ఐలో గిరిజన ఉపప్రణాళిక ద్వారా పరికరాలను, మిరప పంట సాగు లో చేపట్టవలసిన జాగ్రత్తలను,మిరప పంట ద్వారా విలువ ఆధారిత పదార్థాల తయారీ ద్వారా ఆదాయాన్ని ఏ విధంగా రెట్టింపు చేయవచ్చునో రైతులకు వివరించారు. సిటిఆర్ఐ కీటక విభాగ శాస్త్రవేత్త డాక్టర్.వి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మిరప సాగులో వచ్చేటటువంటి వివిధ రకాల చీడపీడలు వాటి నివారణకు వాడవలసిన రసాయనిక మందులు,వాటి మోతాదు వివరాలను

రైతులకు వివరించారు. ఉద్యానవన శాఖ అధికారి ఎం.నవీన మాట్లాడుతూ వాణిజ్య పంటల్లో మిరప సాగు ప్రధమ స్థానంలో ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో 40 మంది అర్హులైన మిరప సాగు చేసే గిరిజన రైతులకు బ్యాటరీ స్ప్రేయర్స్‌ను ఉచితముగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సిటిఆర్ఐ శాస్త్రవేత్తలు డాక్టర్ పూర్ణ బిందు,డాక్టర్ బి.హేమ,ఫార్మ్ మేనేజర్ టి.వెంకటేష్,టి.రమేష్, వై. వెంకటేశ్వరరావు, డి.దేవానంద్, సిహెచ్ .సుధాకర్ బాబు,బి.దుర్గారావు,జి ఎస్ ఎం అన్నపూర్ణ,గిరిజన రైతులు పాల్గొన్నారు.

కడుపునొప్పి భరించలేక మహిళ ఆత్మహత్య

పెదవేగి,మేజర్ న్యూస్: దీర్ఘకాలంగా వస్తున్న కడుపునొప్పిని తట్టుకోలేక ఒక మహిళ పోలవరం కుడికాలువలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. పెదవేగి ఎస్ఐ వి.రాజేంద్రప్రజాద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. లింగపాలెం మండలం మఠంగూడేనికి చెందిన గద్దే శ్రీదేవి చాలాకాలంగా కడుపునొప్పితో బాధపడుతోంది. సోమవారం ఉదయం ఏలూరు వెళ్ళి తిరిగి ఇంటికి వెళ్తూ సాయంత్రం 5.30 గంటల సమయంలో తన దగ్గర ఉన్న పర్సు అదే బస్సులో ఉన్న మరంగూడెం గ్రామానికి చెందిన ఓ యువరునికి ఇచ్చి, పెదవేగి మండలం జానంపేట సమీపంలో పోలవరం కుడికాలువ దగ్గర బస్సు దిగింది. కొద్దిసేపటి తరువాత కాలువలోకి దూకింది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది సహకారంతో కాలువలో గాలింపు చేపట్టారు. కాగా మంగళవారం ఉదయానికి కొప్పార సమీపంలో గద్దే శ్రీదేవి(50)మృతదేహాన్ని కనుగొని బయటకు తీశారు. మృతదేహాన్ని ఏలూరు సర్వజన ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రాజేంద్రప్రసాద్ తెలిపారు.

జససేన సభ్యత్వ నమోదు విజయవంతం చేయాలి

–ఉభయ గోదావరి జిల్లాల అధికార ప్రతినిధి,రెడ్డి అప్పల నాయుడు

ఏలూరు,మేజర్ న్యూస్: ఏలూరులో క్రియాశీలక సభ్యత్వం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉభయగోదావరి జిల్లాల అధికార ప్రతినిధి ఏలూరు నియోజకవర్గ రెడ్డి అప్పలనాయుడు క్రియా శీలక సభ్యత్వం వాలంటీర్లకు పిలుపునిచ్చారు. జనసేన పార్టీ సభ్యత్వ నమోదు ప్రక్రియను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని ఆయన కోరారు. జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ఈ నెల 18 నుండి 28 వరకు క్రియాశీలక సభ్యత్వం నమోదు కొనసాగుతుందని వెల్లడించారు.. ఏలూరులో పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులు ,కార్యకర్తలు,వీర మహిళలు, వాలంటీర్లతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు..

ఏలూరు నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేసేందుకు ఇదో సువర్ణ అవకాశంగా మలుచుకోవాలని ఆయన సూచించారు.. క్రియాశీల కార్యకర్తలు ప్రమాదవశాత్తు మరణిస్తే 5 లక్షల రూపాయలు, అంగవైకల్యం బారిన పడితే 50 వేలు పార్టీ అందజేస్తుందని తెలియజేశారు..

పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఇందుకోసం నిరంతరం కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు నగిరెడ్డి కాశీ నరేష్, ప్రధాన కార్యదర్శి సరిది రాజేష్, కార్యదర్శి బొత్స మధు, ఎట్రించి ధర్మేంద్ర, మీడియా ఇంచార్జీ జనసేన రవి తదితరులు పాల్గొన్నారు.

జుత్తిగ లయన్స్ క్లబ్ అధ్యక్షులుగా వెంకట రామారెడ్డి

పెనుమంట్ర,మేజర్ న్యూస్ : మండలంలోని జుత్తిగ గ్రామ లయన్స్ క్లబ్ అధ్యక్షులుగా డి వెంకట రామారెడ్డి నియామకం అయ్యారు. మంగళవారం లయన్స్ క్లబ్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో క్లబ్ అధ్యక్షులుగా డి వెంకట రామారెడ్డి, కార్యదర్శిగా జి జ్యోతి, కోశాధికారిగా ఎస్ రామకృష్ణారెడ్డి నియామకమయ్యారు.

ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు వెంకటరామారెడ్డి మాట్లాడుతూ లయన్స్ క్లబ్ అధ్యక్షులుగా తనకు అవకాశం ఇచ్చినందుకు క్లబ్ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మునుముందు మరిన్ని సేవా కార్యక్రమాలు చేసేందుకు కలసికట్టుగా అడుగులు వేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో రీజనల్ చైర్ పర్సన్ గొంట్ల కృష్ణమూర్తి, రీజియన్ సెక్రటరీ మతి శ్రీ రమేష్, జుత్తిగ కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.